కథానిక

# ఆనందరావు టోపీ

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

మధ్యాహ్నం రెండయేసరికి డి. యస్. ఓ. లోకనాథన్ నాకు కబురు పెట్టాడు. షార్టుహేండు పెన్సిలు మాత్రం తీసుకుని అతని రూముకి వెళ్ళేను.

నేను వెళ్ళేసరికి గదిలో లోకనాథన్, సి.ఐ.డి. ఇన్స్పెక్టరూ మాత్రం కూర్చుని మాట్లాడుకుంటున్నారు. నేను ప్రక్కన కూర్చున్నాను.

"కరప్షన్ పూర్తిగా ఎక్కువ అయిపోయింది" అన్నాడు లోకనాథన్ చాలా చిరాకుగా సి.ఐ.డి. ఇన్స్పెక్టరు రామనాథం వైపు చూస్తూ. నా వైపు చూడడని నాకు తెలుసును. అతను తీసుకొంటూన్న "రిష్కి" నే నెగా సాక్ష్యం?

"పూర్తిగా డిజ్గస్టు అయిపోతిమి సార్" అన్నాడు రామనాథం.

"నా లైఫ్‌లో కరప్షన్ పూర్తిగా ఎరాడికేట్ చెయ్యవలె; నాను నిద్రపోవల. కొంప ముంచేస్తాను" అన్నాడు లోకనాథన్ కొంత తెలుగులోనూ, కొంత ఇంగ్లీషులోనూ.

ఆరోజైనరో. గుమాస్తామీద ఇన్‌క్వయరీ కరప్షన్ కేసులో. రామనాథం కేసు కొంత తప్పుగా బనాయించాడని నా అనుమానం. ఎంచేతంటే అతను వేసుకున్న సాక్షులు దిన కూలి పుచ్చుకుని సాక్ష్యం చెప్పే వాళ్లు. అయినా నా అనుమానాలకీ, నా నిదర్శనాలకీ లోకనాథన్‌గారు ఏమీ కేర్ చెయ్యరు. అందుచేత వాటిని పదిలంగా నేనే దాచుకున్నాను.

కాని లోకనాథన్, రామనాథం, కాబోయే బలిమీద కత్తులు నూరుతున్నారు.

"రెడీయేనా?" అన్నాడు లోకనాథన్ నా వైపు తిరిగి.

"యస్ సార్" అన్నాను.

లోపలికి ఒక గుమాస్తా వచ్చాడు. కాగితాలు సర్దుకున్నాను.

"నమస్కారం సార్" అన్నాడు నిర్భయంగా. లోకనాథన్ ముఖంలో కొంచెం చికాకు తొణికిసలాడింది-భార్యలు తిరుగుబాటు చేస్తే బాధలేదు, కాని గుమాస్తా వణకకపోతే? ఇన్సల్ట్!

"ఈవేళ ఇక్కడి కెందుకు వచ్చావో తెలుసునా?" లోకనాథన్ ఇంగ్లీషులో అడిగాడు.

"మీరు కబురు చేశారు" గుమాస్తా తెలుగులో చెప్పాడు. లోకనాథన్ రామనాథంతో అరవంలో "తెలుగువాళ్ళంటే ఇందుకే నాకు చాలా కోపం" అన్నాడు. రామనాథం సమర్థించాడు.

"నీమీద ఛార్జీ పెట్టారు, కరప్షన్. నువ్వేమి చెప్పినా అది నీమీద ఎవిడెన్సు అవుతుందని మనస్సులో పెట్టుకో" అన్నాడు రామనాథం.

"యస్ సర్" అన్నాడు గుమాస్తా.

"నీమీద ఛార్జీ-16వ తేదీన ఒక ఆసామీ దగ్గర నూట ఏభై రూపాయలూ, పదిహేడున ఏభై, ఇరవైన పదకొండూ, ఇరవై రెండున ముప్ఫయి-నువ్వు లంచంగా తీసుకున్నావని."

ఆనందరావు (ఆ గుమాస్తా) తన జేబులో కాగితం తీసుకుని చూసి, "అంతేనండి" అన్నాడు. అప్పటిదాకా అతను నిలబడే మాట్లాడుతున్నాడు. అప్పుడు కూర్చున్నాడు ప్రక్క కుర్చీలో. వాళ్ళిద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

"మీరు చెప్పదలచుకున్న దేమైనా వుందా?" లోకనాథన్.

"ఉందండి."

"అయితే, చెప్పవచ్చును."

ఆనందరావు లేచి నిలబడి, చేతులు జోడించి "ఈ ఛార్జెస్ అన్నీ కేవలం కల్పించబడ్డాయి" అన్నాడు.

"దొంగ కేసా?" అన్నాడు రామనాథం కోపంగా.

"ప్రూఫ్?" అన్నాడు లోకనాథన్.

"దీనికి ప్రూఫ్ ఒక్కటేనండి, నేను లంచం తీసుకోకపోవడమే" అన్నాడు ఆనందరావు.

డ్రమెటిక్‌గా రామనాథం కాలింగ్ బెల్ కొట్టి, "అప్పలసామిని పిలూ" అన్నాడు.

కొద్ది సెకండ్లలో అప్పలసామి వచ్చాడు. సవినయంగా చేతులని జోడించి నిలబడ్డాడు.

"ఏమయ్యా అప్పలసామీ! వీరి నెరుగుదువా?" రామనాథం.

"చిత్తం. డి.ఎస్.ఓ గుమాస్తాగారండి,"

"పదహారో తారీఖున నీకు రావలసిన పెర్మిట్ ఈయన సక్రమంగా ఇచ్చేడా?"

"నూట యాభై రూపాయలు తీసుకొని కాని పెర్మిట్ ఇచ్చేరు కాదండి"

ఆనందరావు ముఖంలో చాలా బాధ కనిపించింది.

"సరే వెళ్లు."

మళ్ళా కాలింగ్ బెల్. "వెంకట్రావుని పిలూ."

"నమస్కారం అండి"- వెంకట్రావు.

"మీరు వీరి నెరుగుదురా?" రామనాథం.

"అయ్యో! టి.యస్.ఓ. గుమాస్తా గారు."

"వీరు లంచం తీసుకున్నట్లు మీరు పిటీషన్ ఇచ్చారు?"

"చిత్తం"

"వివరాలు చెప్పగలరా?"

"ఆగస్టు పదిహేడున ధాన్యం పెర్మిటుకి వీరు ఏభై రూపాయిలు పుచ్చుకున్నారండి."

"సరే, మీరు పోవచ్చును." వెంకట్రావు వైపు గుడ్లురిమి చూశాడు గుమస్తా

తరువాత చార్జెస్‌కి కూడా సాక్ష్యం తీసుకున్నారు. తారీఖుల ప్రకారం, వేర్వేరు ఆసాములు సాక్ష్యం ఇచ్చారు.

ఆనందరావు మాత్రం చాలా బాధపడ్డాడు.

సాక్ష్యం అంతా అయ్యాక, మళ్ళా ఆనందరావు వైపు తిరిగి లోకనాథన్ "ఏమయ్యా, ఇప్పుడేమిటి అంటావు?" అన్నాడు.

"నేను లంచాలేమీ తీసుకోలేదు"

"ఆహా! ఇంత సాక్ష్యమూ అయ్యాకనా అలాగ వాదన? నీకు డిస్మిసల్ రికమెండు చేస్తాను" అన్నాడు.

ఆనందరావు లేచి, "ఈ సాక్ష్యాలన్నీ కేవలం సృష్టించినవి. నేను ఎప్పుడూ దమ్మిడీ లంచం తీసుకోలేదు. ఇంట్లో అతికష్టంమీద సంసారం వెళ్ళబుచ్చుతున్నాను. జీతం కట్టలేక మా అమ్మాయిని బడి మానిపించాను. లంచాలే తీసుకుని ఉంటే నేనూ ఈపాటికి ఒకటో రెండో మేడలు కట్టి ఉందును. దరిద్రంతో చచ్చిపోయే ఈ హీన స్థితినించి ఏనాడో విడుదల అయి ఉందును. వీళ్ళంతా ఎన్నో సార్లు నాకు లంచం ఇవ్వజూపినవాళ్ళే. పురుగుల్లాగ వాళ్లని దూరంగా ఉంచి మళ్ళా అలాటిపనిచేస్తే కేసు పెట్టిస్తానని భయపెట్టాను. నా జీవితంలో ఒక ఆదర్శం పెట్టుకుని ఇప్పటి దాకా బ్రతికాను. ఏ పరిస్థితుల్లోనూ ఒక దమ్మిడీ కూడా అన్యాయంగా తీసుకో కూడదని అనుకున్నాను. ఆ మహత్తర ఆదర్శంతో, అవసరమైతే ఉపవాసాలు చేశాను, చింకి బట్టలు కట్టాను. ఎన్నో బాధలు పడాలో పడ్డాను. కాని ఈ పెను గాలులకి నా మనోనిగ్రహం తలవెంట్రుక వాసి కదలలేదు. చావు ఒకసారే వస్తుందనే సూత్రం మరువలేను.

"ఈ నిమిషంలో నాస్థితి మీకు తెల్సునా! నా భార్యకి మందిచ్చుకోలేక అత్తవారింటికి పంపాను. నా అప్పులు లెక్క చూసేరా? కూతురు పెళ్ళి సంవత్సరం నించి వాయిదా వేస్తున్నాను! మీరు చెప్పినట్లు లంచం పుచ్చుకొనేంత నీచపు పని చేసి ఉంటే ఈ దుర్గతి, ఈ కష్టాలు, ఈ అవమానాలు ఇవన్నీ అనుభవింప వలసి వచ్చే?

"మీ మనస్సుకి సత్యం తెలుసును. నా నిర్దోషిత్వం మీకు తెలుసును. ఎంతమంది గుమాస్తాలు ఈ పాపం చేస్తున్నారో వాళ్ళందరినీ మీకు తెలుసును. ఐనా నేను మీకు దోషిగా కనపడడం నా దురదృష్టం.

"మీ ఇష్టం వచ్చినట్లు చెయ్యడానికి మీకధికారం ఉంది. నా జీవితాన్ని మీరు నాశనం చెయ్యగలరు. కాని భగవంతుడున్నాడు, ఆలోచించండి. మా మామగారు లక్షాధికారి. ఆయన కుమార్తెకి యెంతడబ్బో యిచ్చాడు. కాని స్త్రీవిత్తం అని అందులో ఒక్క పైస నేను ముట్టుకోక, స్వార్జితంతో దరిద్ర జీవ

నా కెన్నో యెంచుకున్నానో లేదో కావలిస్తే కనుక్కోండి."

లోకనాథన్, రామనాథం ఆ గుమాస్తా మహోద్రేకంతో యిచ్చిన ఈ ఉపన్యాస ధోరణిలో మునిగిపోయారు. ఏ గుమాస్తావాళ్ళని ఇంత ఘాటిగా ప్రశ్నించలేదు.

ఆనందరావుని బయటికి పంపించి వాళ్ళిద్దరూ సంభాషణ ప్రారంభించారు. ఆనందరావు నిజంగా నిర్దోషి అని అనుమానం కలిగింది లోకనాథన్‌కి. రామనాథం మాత్రం తనపట్టు వీడడు.

మళ్ళా గుమాస్తాని లోపలికి పిలిచారు.

"నిన్ను కొంతకాలం సస్పెన్షన్‌లో పెడతాను. నువ్వు చెప్పినదంతా నేను నమ్మలేను" అన్నాడు లోకనాథన్.

ఆనందరావు మహాశ్చర్యంతో చూశాడు. మళ్ళా ఉపన్యాసం ప్రారంభిస్తాడనుకున్నారు.

"చిన్న కాగితం కలం ఇస్తారా?" అన్నాడు.

లోకనాథన్ ఇచ్చాడు. ఆనందరావు డి.యస్.ఓ.కి అడ్రస్ చేసి ఏదో రాస్తున్నాడు.

ఇంతలో బైటనించి జవాను కేక వినిపించింది. ఆనందరావు కేదో టెలిగ్రాం

"లోపలికి పట్టుకురా" అన్నాడు లోకనాథన్.

సగం రాత నుంచి, టెలిగ్రాం తీసుకున్నాడు ఆనందరావు. "నీభార్య చచ్చిపోతూంది. బయలుదేరు" అని. అందరూ చూశారది.

ఆనందరావు ఒక్కసారి నుదురు తుడుచుకుని, టెలిగ్రాం జేబులో ఉంచుకుని ఏమీ జరగనట్లే కాగితం రాయటం పూర్తి చేశాడు. అది రెజిగ్నేషన్ లెటర్.

"నా జీవితం, గౌరవం, సంసారం అన్నీ నశించాక ఉద్యోగం యెందుకుసార్? నా రిజిగ్నేషన్ అంగీకరించండి"

ఆ నిముషంలో లోకనాథన్ ఏమిటి, రాతి గుండెవాడైనా చివరకి లంచం ఇచ్చినవాడైనా అతని నిర్దోషిత్వాన్ని శంకించడు. రామనాథం మాత్రం కరగలేదు కొంచెంకూడా.

"ఇది తరువాత ఆలోచిస్తానులే. ముందు నువ్వు వెళ్ళి భార్యని చూడు" అన్నాడు లోకనాథన్.

"ఇంత అవమానం భరించడం చాలా కష్టం అండి. నా రెజిగ్నేషన్ తమ రంగీకరించేదాకా నేను కదలను."

లోకనాథన్ మనస్సు కరిగిపోయింది.

లోకనాథన్ కలం తీసి, "నువ్వు ఇన్నోసెంట్. నీమీద చార్జెస్ డ్రాప్ చేస్తున్నాను. నీలాంటి వాళ్ళు ఇప్పుడు దేశానికి కావాలి. వెంటనే వెళ్ళి భార్య ఆరోగ్యం చూసుకో. ఈ పది రూపాయిలూ ఖర్చులకిఉంటాయి తీసికెళ్ళు" అని బలవంతాన ఆ పదీ అతనికిచ్చిపంపాడు.

* * *

మిత్రులు కథనంతా విని, "పాపం, అతని భార్య అతను వెళ్ళేదాకా బ్రతికి ఉందా?" అన్నారు.

"గొప్ప కారక్టరోయ్" అన్నారు మూర్తి.

"అతని భార్యకి జబ్బేమీ లేదు. ఊరికే డ్రమెటిక్ అఫెక్ట్ కోసం ఆ టెలిగ్రాం అతనే ఏర్పాటు చేసుకున్నాడు" అని నిజం బయట పెట్టాడు కృష్ణమూర్తి.

అంతా తెల్లబోయారు.

"అంతే కాదు, మొన్ననే అతను ముప్పై వేలకి డ్రామా థియేటరు కట్టించి, మంచినాటకాలు వేయిస్తున్నాడు. హీరో అతనే లెండి"

కృష్ణమూర్తి పూర్తి చేశాడు.

కిరాణా కొట్లో కొత్తగా పనిలో చేరిన కుర్రాణ్ణి షావుకారు అడిగాడు: "నీ పేరు?" కుర్రాడు "నా పేరు పోతన్న అంటారండి." అన్నాడు.

"ఇంటి పేరు?" "బమ్మెర వారండి."

షావుకారు కాస్త ఆలోచించి అన్నాడు: "ఎక్కడో విన్న పేరులా ఉందే!"

కుర్రాడు గర్వంగా యిలా చెప్పాడు: "చిత్తం. వినే ఉంటారు. రెండేళ్ళనుంచీ యీ వీధిలోనే ఉంటున్నానండి!"